
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

గురువారం 15 ఫిబ్రవరి 2024

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఫిబ్రవరి 14: జిల్లాలోని తెలంగాణ మోడల్‌స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో 100సీట్లకు, 7-10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రేణుకాదేవి తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు 200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

యాడారం పెద్దగుట్టపై ఆదిమానవుల ఆనవాళ్లు

- మేడ్చల్ జిల్లాలో కొన్నివందల ఏళ్ల నాటి రాతిచిత్రాలు
- మరిన్ని ఆధారాలను గుర్తించిన పరిశోధకులు
- పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలి : శివనాగిరెడ్డి



ఆనవాళ్లను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాద్ సిటీ/శామీర్‌పేట, ఫిబ్రవరి14 : మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్‌పేట మండలం యాడారం గ్రామంలోని పెద్దగుట్టపైనున్న ఆదిమానవుల ఆవాసాలను, ఆనాటి వర్ణచిత్రాలను పరిశీలించినట్లు ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివ నాగిరెడ్డి తెలిపారు. ద్యావనపల్లి సత్యనారాయణ 2017లో గుర్తించిన ఈ శిలాయుగపు స్థావరాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందంతో కలిసి తాను బుధవారం సందర్శించి మరిన్ని విషయాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నాలుగు అంతస్తుల రాతి ఆవాసపు మూడో అంతస్తులో 60అడుగుల ఎత్తులోని రెండు నిలువు రాతి బండలమీద సూక్ష్మరాతి యుగానికి (క్రీ.పూ 8,500) చెందిన మూపురం ఉన్నఎద్దు, మూపురం లేని ఎద్దు, మనుషుల బొమ్మలను పరిశీలించినట్లు తెలిపారు. వీటితో పాటు కొత్త రాతియుగం(క్రీ.పూ4000) ఎద్దు, నెమలి బొమ్మలు, ఇనుప యుగానికి చెందిన (క్రీ.పూ 1000) ముగ్గులను పోలిన రేఖాచిత్రాలు, చారిత్రక తొలియుగం (క్రీ.శ 1 నుంచి 2మధ్యకాలం) శృంగార భంగిమలో నెలవైన మూడు జంటలు తదితర చిత్రాలను గమనించినట్లు వివరించారు. వీటి ద్వారా యాడారం గుట్ట సూక్ష్మరాతి యుగం నుంచి చారిత్రక తొలి యుగం వరకు ఆదిమానవులకు నివాస స్థలమని ద్యావనపల్లి పరిశోధనలో వెల్లడైన విషయాన్ని శివనాగిరెడ్డి గుర్తు చేశారు. గుట్ట కింద సూక్ష్మరాతి యుగపు పనిముట్లు, కొత్త రాతియుగంలో రాతిగొడ్డళ్లను అరగదీసిన గుంటలు, ఇనుప యుగంనాటి సమాధి ఆనవాళ్లు... ఈ రేఖా చిత్రాల పురా చరిత్రకు ఆధారమని, వాటిని కాపాడుకోవాలని స్థానికులకు సూచించారు. కొన్నివందల ఏళ్లచరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని శివనాగిరెడ్డి సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యులు మహమ్మద్ నసీరుద్దీన్, అహోబిలం కరుణాకర్ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు 17నుంచి స్లాట్ బుకింగ్

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి14: దివ్యాంగులు, బుద్ధి మాంద్యం, చెవుడు మూగ వారు సదరం సర్టిఫికెట్ల కోసం నెల 17వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20, 23, 26, 27, మార్చి 8, 9, 16, 19, 30 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకున్నవారు హాజరుకావాలని తెలిపారు. అదేవిధంగా ఈనెల 20, 21, 23, 27, మార్చి6, 22, 26, 27 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ కాలపరిమితి అయిపోయిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలన్నారు.

మారిన వ్యూహం!

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ఫోకస్

ఉమ్మడి జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నిన్న మొన్నటి వరకున్న అసెంబ్లీ ఎన్నికల వేడి తగ్గుతున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలు మళ్లీ రాజకీయ వేడిని రగిలిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ పరంపర సాగించి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచుతోంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కోలుకోలేని విధంగా దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇప్పటికే చేరికలకు సంబంధించిన బాధ్యతలను కొందరు ముఖ్యనేతలకు అప్పగించింది. పార్లమెంట్ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వరుసగా జరిగే అవకాశం ఉండడంతో వీటిని దృష్టిలో పెట్టుకుని చేరికలపై ఫోకస్ పెంచారు.





కామ్‌గా బీఆర్ఎస్ ముఖ్యనేతలు

బీఆర్ఎస్‌పై ముప్పేట దాడికి సిద్ధమవుతున్న కాంగ్రెస్ వారం, పది రోజుల్లోనే గులాబీకి భారీ షాక్ ఇవ్వనున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా కొద్ది రోజులుగా కామ్‌గా ఉండడం చూస్తే ఆ పార్టీలో ఏదో జరుగుతుందనే ప్రచారానికి బలం చేకూరుస్తోంది. ఇటీవల మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా తాను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని కీసర ఆలయానికి ఆహ్వానిస్తానని పేర్కొవడం గమనార్హం. అలాగే ఆయన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. రంజిత్‌రెడ్డి చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ టికెట్ కోసం ఖర్చీఫ్ వేసినట్లు తెలియడంతోనే మమహేందర్‌రెడ్డి జాగ్రత్తపడ్డారని చెప్పారు. అప్రమత్తమైన మహేందర్‌రెడ్డి ఆగమేఘాలపై సీఎం రేవంత్‌ను కలిశారని చెప్పడం రాజకీయకలకలం రేకెత్తించింది. దీన్ని రంజిత్‌రెడ్డి కూడా ఇంతవరకూ ఖండించక పోవడం గమనార్హం.

- బీఆర్ఎస్‌పై ముప్పేట దాడికి ప్రణాళిక
- జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలపై దృష్టి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మంతనాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సమయాత్తమవుతున్న కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ఆపార్టీ ప్రధాన నేతలను తమ వైపు తిప్పుకునేందుకు ఓవైపు ప్రయత్నాలు చేస్తూనే మరో వైపు క్షేత్రస్థాయిపై ఎక్కువ ఫోకస్ మొదలు పెట్టింది. బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు. మున్సిపల్, కార్పోరేషన్ చైర్మన్లను పెద్ద సంఖ్యలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కోలుకోలేని విధంగా దెబ్బకొట్టాలని భావిస్తున్న కాంగ్రెస్ చేరికలకు సంబంధించిన బాధ్యతలను కొందరు ముఖ్యనేతలకు అప్పగించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో వీరు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్, కార్పోరేషన్ చైర్మన్లతో వరుస భేటీలవుతున్నట్లు తెలిసింది.

వలసల జోరు

పార్లమెంట్ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వరుసగా జరిగే అవకాశం ఉండడంతో వీటిని దృష్టిలో పెట్టుకుని చేరికలపై ఫోకస్ పెంచారు. ఇప్పటికే మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. త్వరలో వీరితో పాటు వారి అనుచరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసిన తరువాత స్థానికంగా బహిరంగ సభలు నిర్వహించి అనుచరవర్గంతో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఇదిలా ఉంటే మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తనతో పాటు కొందరు ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్‌లో తీసుకువెళ్లేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో తన సహచరులుగా ఉన్న ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి రప్పించేందుకు ఇప్పటికే ఆయన రంగంలో దిగారు. కాంగ్రెస్‌లో చేరేందుకు కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సానుకూలంగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కూడా ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

ఆ మూడు కుటుంబాలతో మారిన రాజకీయం







ఉమ్మడిజిల్లాలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారుతున్నాయి. మూడు రాజకీయ కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు రావడంతో రాజకీయాలు కొత్త మలుపులు తిరగడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన కుమారుడు, మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ఫలితాల అనంతరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తీగల కృష్ణారెడ్డి కోడలు, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. తనతో పాటు తన కోడలు అనితారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తీగల ఇటీవల ప్రకటించారు. ఇదిలా ఉంటే తాజాగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడి తన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగే అవకాశాలు ఉన్నాయి. ఇలా మూడు రాజకీయ కుటుంబాలకు చెందిన వారు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో మూడు జిల్లా పరిషత్‌లు త్వరలో కాంగ్రెస్ పరంకానున్నాయి.

బదిలీల పర్వం.. బాధ్యతల స్వీకరణ

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట, ఫిబ్రవరి 14 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారిగా యు.అరుంధతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మర్యాద పూర్వకంగా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి పూలబొకే అందజేశారు. హైదరాబాద్ జిల్లాలో అదనపు పౌర సంబంధాలశాఖ అధికారిగా పనిచేసిన ఆమె బదిలీపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు వచ్చారు. కాగా ఘట్‌కేసర్ ఎంపీడీవో (మండల పరిషత్ అభివృద్ధి అధికారి)గా ఎల్.గీతారెడ్డి, తహసీల్దారుగా డీఎస్ రజినిలు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గీతారెడ్డి యాదాద్రి జిల్లా, వలిగొండ మండలం నుంచి బదిలీపై ఘట్‌కేసర్‌ఎంపీడీవోగా రాగా, రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్ యుఎల్‌సీ(అర్బన్ ల్యాండ్ సీలింగ్) విభాగం నుంచి రజిని బదిలీపై ఘట్‌కేసర్ తహసీల్దారుగా వచ్చారు. శామీర్‌పేట మండల పరిషత్ నూతన ఎంపీడీవోగా మమతబాయి బుధవారం బాధ్యతలను చేపట్టారు. శామీర్‌పేటనూతన తహశీల్దార్‌గా త్వరలో సుశీల నియామకం కానున్నట్లు తెలిసింది.



మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన అరుంధతి

వికారాబాద్ జడ్పీ సీఈవోగా సుధీర్

వికారాబాద్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/తాండూరు :వికారాబాద్ జిల్లా పరిషత్తు సీఈవోగా ఎం.సుధీర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఈవోగా పనిచేసిన జానకిరెడ్డి సంగారెడ్డికి బదిలీ కాగా, నిర్మల్ జడ్పీ సీఈవోగా పనిచేసిన సుధీర్ బదిలీ పై జిల్లాకు వచ్చారు. కాగా జడ్పీ డిప్యూటీ సీఈవోగా ఎస్.వసంత బాధ్యతలు స్వీకరించారు. జనగామ జడ్పీ డిప్యూటీ సీఈవోగా పని చేసిన ఆమె ఇక్కడకు బదిలీ పై రాగా, ఇక్కడ పనిచేసిన సుభాషిణి రంగారెడ్డి జిల్లా డీఆర్డీవో అదనపు పీడీగా బదిలీ అయ్యారు.

ఎంపీడీవోల కేటాయింపు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలకు మండలాలు కేటాయిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. యాదాద్రి -భువనగిరి జిల్లా నుంచి వచ్చిన ప్రభాకర్‌రెడ్డిని పరిగి ఎంపీడీవోగా నియమించగా,సంగారెడ్డి జిల్లా నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన కె.విశ్వప్రసాద్‌ను తాండూరు ఎంపీడీవోగా, ఎ.రాములును బంట్వారం ఎంపీడీవోగా నియమించారు. రంగారెడ్డి జిల్లా నుంచి జిల్లాకు వచ్చిన మహేష్‌బాబుకు దోమ ఎంపీడీవోగా, అనురాధకు కోట్‌పల్లి ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. జె.రాఘవులును బషీరాబాద్ ఎంపీడీవోగా, కె.రామకృష్ణను కులకచర్ల ఎంపీడీవోగా నియమించారు. కె.వినయకుమార్‌కు వికారాబాద్ ఎంపీడీవోగా, జి.హరీష్‌కుమార్‌కు పెద్దేముల్ ఎంపీడీవోగా, జి.విజయలక్ష్మి దౌల్తాబాద్ ఎంపీడీవోగా, బి.నర్సిములు ధారూరు ఎంపీడీవోలుగా పోస్టింగ్ ఇచ్చారు. ఎంపీడీవోలు తమకు కేటాయించిన మండలాల్లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.





సుధీర్, జడ్పీ సీఈవో, వసంత, డిప్యూటీ సీఈవో

వికారాబాద్, తాండూరు డీఎస్పీల బదిలీ

జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు డీఎస్పీలు బదిలీ అయ్యారు. వికారాబాద్ డీఎస్పీ కె.నర్సింహులు, తాండూరు డీఎస్పీ జి.శేఖర్ గౌడ్‌లను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో సీసీఎస్, డీడీ/సిట్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సి.అంజయ్యను వికారాబాద్ డీఎస్పీగా నియమించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ డీఎస్పీగా పనిచేస్తున్న కె.బాలక్రిష్టారెడ్డిని తాండూరు డీఎస్పీగా బదిలీ చేశారు. కాగా, వికారాబాద్, తాండూరు డీఎస్పీలు నర్సింహులు, శేఖర్‌గౌడ్‌లకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఒక్కరోజే గడువు

నేటితో ముగియనున్న పెండింగ్ చలాన్లపై రాయితీ గడువు

- రాయితీతో ఇ-చలానా చెల్లింపులు
- 71 శాతం వాహనదారులు మాత్రమే సద్వినియోగం



వికారాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇ-చలాన్ల చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీ గడువు నేటితో ముగియనుంది. ఇ-చలాన్లు నమోదైన వాహనదారులు తాము చెల్లించాల్సిన జరిమానాను రాయితీతో చెల్లించేందుకు గత ఏడాది డిసెంబరు 27వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు ప్రభుత్వం అనుమతించింది. కాగా, ఈ-చలాన్లు నమోదైన వాహనదారులు రాయితీతో జరిమానా చెల్లించేందుకు గడువు పెంచాలనే విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగింది, ఇ-చలాన్ల జరిమానాను రాయితీతో చెల్లించేందుకు గురువారంతో గడువు ముగియనుంది. ఇ-చలాన్లు జారీ అయిన వాహనదారులు తాము చెల్లించాల్సిన అపరాధ రుసుమును సంవత్సరాల తరబడి చెల్లించకుండా కోట్లాది రూపాయలు బకాయిల రూపంలో పేరుకుపోవడాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన జరిమానాపై రాయితీ ప్రకటించింది. ఇ- చలాన్ కేసులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు ఊరట కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జరిమానాలో భారీ రాయితీ ప్రకటించింది. బుధవారం వరకు జిల్లాలో 71.71 శాతం మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. ఇ-చలాన్ కేసులు నమోదైన వారిలో ఇంకా 28.29 శాతం మంది వాహనదారులు మిగిలిపోయారు. రాయితీని సద్వినియోగం చేసుకోవడానికి ఒకరోజు మాత్రమే గడువు మిలిగింది. ఇ -చలాన్ విధానం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహనాల నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలపై 8,25,542 ఇ-చలాన్లు నమోదు చేసి రూ.34,12,37,010 జరిమానా విధించారు. బుధవారం వరకు 592928 ఇ-చలాన్లకు సంబంధించి రూ.11,91,48,152 జరిమానా చెల్లించారు. ఇంకా జిల్లాలో 2,33,514 ఇ-చలాన్లకు సంబంధించి రూ.9,32,25,760 జరిమానా చెల్లించాల్సి ఉంది.

వినియోగించుకోని వైనం

పెండింగ్‌లో ఉన్న ఇ- చలాన్లు పరిష్కరించేందుకు పోలీసు శాఖ ఎంతో శ్రమకోరుస్తున్నా ఆశించిన ఫలితం లేకపోవడంతో వాహనదారులు చెల్లించాల్సిన జరిమానాలో భారీ రాయితీ ఆఫర్ ఇచ్చింది. పెండింగ్ చలానాలు పరిష్కరించేందుకు జరిమానాలో రాయితీ కల్పిస్తే చెల్లించడానికి ముందుకు వస్తారని, తద్వారా కేసుల పెండెన్సీ ఉండదని భావించిన పోలీసుశాఖ వాహనదారులు అవకాశం కల్పించింది. గతఏడాది డిసెంబరు 27వ తేదీ నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఇ-చలాన్లు జారీ అయిన వాహనదారులు రాయితీతో చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఇ-చలాన్లపై విధించిన జరిమానా చెల్లించడానికి వాహనదారులు ఆశించిన స్థాయిలో ముందుకు రాకపోవడంతో పెండింగ్‌లో పేరుకుపోతున్న ఇ-చలాన్లను క్లియర్ చేసేందుకు 2022లో అప్పటి ప్రభుత్వం వాహనదారులు చెల్లించాల్సిన జరిమానాలపై ప్రత్యేక రాయితీ ప్రకటించింది. ఇ-చలానాలు ఉన్న వాహనదారులు చాలా వరకు సద్వినియోగం చేసుకున్నా.. కొందరు చెల్లించకుండా మొండికేశారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను క్లియర్ చేసేందుకు కొత్త ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించింది. ద్విచక్రవాహనాలు, ఆటోలపై నమోదైన ఈ చలాన్‌ల జరిమానాలో 80 శాతం రాయితీ ప్రకటించగా, విధించిన అపరాధ రుసుములో వారు 20 శాతం చెల్లిస్తే ఇ-చలానాలు తొలగిపోతాయి. లైట్‌మోటార్, హెవీ మోటార్ వాహనాలకు జారీ చేసిన ఇ-చలాన్లపై విధించిన జరిమానాలో 60 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించగా, మిగిలిన 40శాతం చెల్లిస్తే సరిపోతుంది. అదే ఆర్టీసీ బస్సులకు 90 శాతం రాయితీ ప్రకటించారు. రాయితీ పోగా మిగిలిన 10 శాతం జరిమానా చెల్లిస్తే ఇ-చలాన్లు పరిష్కారం కానున్నాయి. ఇ- చలాన్లపై విధించిన జరిమానా బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తేనే ప్రభుత్వం ప్రకటించిన రాయితీ వర్తించేలా నిబంధన విధించారు.

ఉలికిపాటు!

- ఏసీబీ దాడులతో రెవెన్యూ అధికారుల్లో గుబులు
- కీలక ఆధారాలతో కలెక్టరేట్‌లో ఉద్యోగులపై ఏసీబీ నజర్
- ఇప్పటికే ఇద్దరు ముఖ్య అధికారులను విచారించిన ఏసీబీ
- మరింత లోతుగా అన్వేషణ..

మేడ్చల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి తహసీల్దార్‌తో పాటు ఆయన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో జిల్లాలోని పలువురు రెవెన్యూ అధికారులు ఉలిక్కిపడుతున్నారు. బుధవారం జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. బదిలీలు అయిన తహసీలార్లు మంగళవారం నాటి సంఘటనతో బాధ్యతలు చేపట్టేందుకు కూడా విముఖత చూపడం గమనార్హం. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ సత్యనారాయణ పట్టుబడటంతో రెవెన్యూ అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనితో పలువురు రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడుతున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ సత్యనారాయణతో సత్సంబంధాలు నడిపిన పలువురు అధికారులు భయాందోళనలు గురౌతున్నట్లు సమాచారం. ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న రికార్డుల ప్రకారం కలెక్టరేట్‌లోని ఆయా సెక్షన్లలో పని చేస్తున్న అధికారులను విచారించేందుకు సిద్ధమౌతున్నట్లు సమాచారం. ఇప్పటికే డీ సెక్షన్ ఇన్‌చార్జితో పాటు ఆర్డీవోను కూడా ఏసీబీ అధికారులు పిలుపించుకుని పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. ముఖ్యంగా ధరణి ప్రక్రియపైనే ఏసీబీ అధికారులు పలు అనుమానాలను లేవనెత్తినట్లు తెలిసింది. తహసీల్దార్ సత్యనారాయణ 13 నెలలుగా శామీర్‌పేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ కాలంలో సత్యనారాయణ క్లియర్ చేసిన ఫైల్స్‌పై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సత్యనారాయణకు సహకరించిన వారిపై కూడా ఏసీబీ అధికారులు దృష్టిసారించినట్లు చర్చించుకుంటున్నారు. కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖలో తిష్టవేసిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి పెద్ద ఎత్తున లంచాలకు మరిగారనే ఆరోపణలున్నాయి. నగరశివారులో ఉన్న జిల్లాలోని భూములకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటంతో ఇదే అదనుగా రెవెన్యూ అధికారులు పనులకు సైతం లక్షల్లో డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో పెద్ద ఎత్తున పలు రెవెన్యూ ఫైల్స్‌కు అధికారులు క్లియరెన్స్ ఇచ్చారనే ఆరోపణలున్నాయి. దీనిపై కూడా ఏసీబీ అధికారులు దృష్టిసారించినట్లు సమాచారం. చేతులు తడిపితేనే ఫైల్స్ కదులుతాయనే ఆరోపణల నేపథ్యంలో పాస్‌పుస్తకాల జారీ కోసం పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ పట్టుబడటం ఒక్కసారిగా తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలో కీసర తహసీల్దార్ కోటి రూపాయలతో ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన తర్వాత మళ్లీ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ పట్టుబడటం గమనార్హం. పట్టుబడిన సత్యనారాయణ మరో శివబాలకృష్ణలాగా వెల్లడించే విషయాల ప్రకారం ఎటువంటి రహస్యాలు వెల్లడౌతాయనే అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు (ఫైల్)

ఉర్సుకు డీఎస్పీ, సీఐలకు ఆహ్వానం

బషీరాబాద్, ఫిబ్రవరి 14: బషీరాబాద్‌లో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించే హజ్రత్ శంషాఖాద్రీ దర్గా ఉర్సుకు రావాలని దర్గా కమిటీ నిర్వాహకులు బుధవారం తాండూరు డీఎస్పీ, సీఐలకు ఆహ్వానాలు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులు మునీర్, ఖాలీద్ పోలీసు అధికారులకు ఆహ్వాన పత్రిక ఇచ్చారు.


డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వెంకటేష్, ఉర్సు నిర్వాహకులు

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం

● మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ గాలికి మహేశ్వరంలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగించేలా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహేశ్వరం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడిగా సేవలందించిన కూన యాదయ్యతో పాటు మాజీ ఉపసర్పంచులు దోమశ్రీనివాస్‌రెడ్డి, కర్రోళ్ల రాము, పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, కె. పరమేష్, నయూమ్, జావీద్, కుమార్, జి. జంగయ్య, అంజయ్య, యాదయ్య, రాజు, నర్సింహ, మైసయ్య పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

కాళేశ్వరం అవినీతి గురించి మూడేళ్ల క్రితమే చెప్పా

● మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరుగుతోందని, నిర్మాణంలో నాణ్యతను కూడా పాటించడం లేదని తాను మూడేళ్ల క్రితమే చెప్పానని చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. నాడు తన మాటలు ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. బుధవారం మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ చౌరస్తాలో బీజేపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గస్థాయి కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం దేశంలోనే ఓ భారీ కుంభకోణమని, దాని నిర్మాణంలో నాణ్యతను పాటించలేదని పలు వేదికలు తెలిపినట్లు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే కేసీఆర్ ప్రజల దృష్టిని మరల్చేందుకు కృష్ణాజలాల పంపకాల విషయంపై తప్పుడు విషయాలను చెబుతున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేఆర్ఎంబీపై చర్చ పెట్టాయని విమర్శించారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండాను ఎగరవేయడం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. బీజేపీ చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భీమేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు జ్ఞానేశ్వర్, రాజేశ్వర్, మధు, బట్టు రాజమల్లేష్, పెంటయ్య పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మున్సిపాలిటీలో అక్రమాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14 : మున్సిపాలిటీలో కొంతకాలంగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి, సీడీఎంఏ కార్యాలయాల్లో ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు వెలుగుచూసినా అధికారులు మాత్రం కంటితుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని ఫిర్యాదు చేశామని చెప్పారు. మున్సిపాలిటీ సిబ్బంది వసూలు చేస్తున్న పన్నుల నగదును వారి ఇష్టానుసారంగా సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు ఆరోపించారు. ఈ విషయం మున్సిపల్ ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో మున్సిపాలిటీలో జరిగిన నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జేఈఈ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ బల్‌రాం

కొడంగల్, ఫిబ్రవరి 14 : జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో కొడంగల్ మండలంలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల ప్రారంభమైన మొదటి బ్యాచ్‌లోనే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం హర్షనీయమని ప్రిన్సిపాల్ బల్‌రాం అన్నారు. ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ విద్యార్థులు కిషన్ (65.89%), రాహుల్‌చౌహాన్ (59.67 %), అకిల్ (52.13 %), నవీన్ (49.57 %)లను అధ్యాపకులు అభినందించారు.

జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

● జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 14 : భద్రత నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ఎస్పీ కోటి రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా బుధవారం పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వాహనదారులకు నియమాలపై అవగాహన కలిగించారు. ఒకరి నిర్లక్ష్యం ఇంకొకరికి శాపంగా మారుతుందని చెప్పారు. రోడ్డు భద్రత నియమాలను పాటించకుంటే అయితే రోడ్లు యమపాశాలుగా మారే అవకాశం ఉందని అన్నారు. కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టి తమ వారు బయటకు వెళ్లే సమయంలో రోడ్డు భద్రత నియమాలను తప్పని సరిగా పాటించేటట్లు చూడాలని చెప్పారు. మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని, వారు వాహనాలతో పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. లైసెన్స్‌లేని వారికి వాహనాలు ఇస్తే ఆ యజమానుపైన కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, 4వీలర్స్ వారు సీట్‌బెల్ట్ పెట్టుకొనే వాహనాలు నడపాలన్నారు. డ్రంక్ డ్రైవ్ చేయకూడదని, అలా చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపే వారి దగ్గర అన్ని పత్రాలు ఉండాలని చెప్పారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 26 : మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలోని శ్రీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలకోసం ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం స్థానిక మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ కోట్ల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవతో అర్చకులు మొల్లూరి నవీన్‌శర్మ, గూడ కృష్ణమాచార్యులు మేలుకొలుపు పాడారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అంకురార్పన, దీక్షారాధన నిర్వహించారు.



ఆమనగల్లు : పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కడ్తాల : ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల : మండలంలోని మక్తమాదారం వేణుగోపాల స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో నిత్యనిధి, ఆదివాసం, హోమం, ధ్వజారోహణం, గరుడ సేవ, భేరిపూజ, బలిహరణం, పల్లకిసేవను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, అర్చకులు ఆదిత్యచారి, రంగాచారి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి

● ఏపీజీవీబీ నాగర్‌కర్నూల్ ఆర్ఎం రంజిత్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎం రంజిత్

మాడ్గుల, ఫిబ్రవరి 14 : ప్రతీ ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని ఏపీజీవీబీ నాగర్‌కర్నూల్ రీజినల్ మేనేజర్ రంజిత్ వారనాసి అన్నారు. మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలో బుధవారం ఏపీజీవీబీ నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ఖాతాదారులందరు పీఎంజేజేబీవై, పిఎంఎస్‌బీవైని కలిగి ఉండాలన్నారు. రైతులు తీసుకున్న వివిధ రకాల రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను పొందాలని అన్నారు. పంట రుణాలను చెల్లించని వారు ప్రస్తుతం బ్యాంకు ఇస్తున్న కెసీసీ, ఓటిఎస్‌ని సద్వినియోగం చేసుకుని రుణ విముక్తులు కావాలని సూచించారు. మాజీ జడ్పీటీసీ పగడాల రవి, ఎస్ఎం ఆపరేషన్స్ గౌతమ్‌రెడ్డి, ఓమ్‌కార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలు రద్దు

● కొత్త కమిటీల ఏర్పాటుకు కసరత్తు

● ఆశావహుల ప్రయత్నాలు



బషీరాబాద్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మేడ్చల్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం నియమించిన మార్కెట్ పాలకవర్గాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు కొత్త పాలకవర్గాల ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఇందులో భాగంగా తాజాగా మేడ్చల్ మార్కెట్ కమిటీకి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్త పాలకవర్గం ఏర్పాటుపై నేతలు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అధికారికంగా పాలకవర్గాలు రద్దు కావడంతో కొత్త పాలకవర్గానికి చెందిన ప్రతిపాదనలు పంపించేందుకు మార్గం సుగమం అయింది. జిల్లాలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అనేక మంది నేతలు మార్కెట్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదవి పొందాలంటే మార్కెట్ పరిధిలోని గ్రామానికి చెందిన రైతులు అయి ఉండాలి. ఇప్పటికే పలువురు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో మాదిరిగా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే ఇప్పటికే ఖరారైన రిజర్వేషన్ ప్రకారం పదవి కేటాయించే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. పదేళ్లుగా పదవులులేని కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

బషీరాబాద్ : బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ వ్యవసాయ, సహకారశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మణ్ బుధవారం ధ్రువీకరించారు. నూతన పాలకవర్గం నియామకం జరిగే వరకు రంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయదేవికి పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

నేడు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన

వికారాబాద్, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ రోజు ఉదయం 10 గంటలకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ వినయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వతహాగా తయారు చేసిన ఉత్పత్తులు, హస్తకలలను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్యోద్దేశమని ఆయన చెప్పారు. సంప్రదాయ వృత్తులు చేస్తున్నవారు తమ వృత్తులలో ఆధునిక ఉపకరణాలు, నైపుణ్యం, వృత్తి కళాకారులు, హస్త, కళాకారులను మరింత అభివృద్ధి చేయడం కోసం, అవగాహన పెంపొందించడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సదస్సులో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొంటున్నారని, కుమ్మరులు, విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు, శిల్పులు, కమ్మరులు, వివిధ సంప్రదాయ చేతివృత్తుల వారు, హస్త కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

● ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దత్తునాయక్



కరపత్రాలను విడుదల చేస్తున్న..

మహేశ్వరం, ఫిబ్రవరి 14 : మతతత్వ విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. దత్తునాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంఖాల్ పారిశ్రామిక వాడలో కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు, ఏకమై కార్పోరేట్ మతతత్వ విధానాలను, వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఫిబ్రవరి 16 న సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచి పెడుతూ పేదల సమస్యలను గాలికొదిలేశారని మండి పడ్డారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. దేవేందర్, యాదగిరి, బ్రహ్మచారి, భారతి, కల్పన, నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

స్టేషన్లలో హిస్టరీ షీట్లు ఉన్నవారిపై పోలీసు ప్రత్యేక నిఘా

పెద్దేముల్, ఫిబ్రవరి 14 : పోలీస్ స్టేషన్లలో హిస్టరీ షీట్స్ ఉన్న వారిపై నిరంతరం ప్రత్యేంగా పోలీసు నిఘా ఉంటుందని తాండూరు రూరల్ సీఐ అశోక్‌గౌడ్ తెలిపారు. పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. అక్కడి పోలీసుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలానికి చెందిన పాత నేరస్థులు, హిస్టరీ షీట్లు ఉన్న వారిని స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎల్లవేళలా సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని వారికి సూచించారు. ఇక ముందు ఎలాంటి కేసుల్లో జోక్యం చేసుకోవద్దని, నిత్యం పోలీసు నిఘా ఉంటుందని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గిరి ఉన్నారు.


పాత నేరస్థులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌గౌడ్

రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారు?



సమావేశంలో సమాధానం చెబుతున్న ఇరిగేషన్ డీఈ

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 14: కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వక పేదలు ఇబ్బంది పడుతున్నారని, కొత్త తెల్ల రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారో చెప్పాలని మండల సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హేమీబాయి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులు ఇవ్వ లేదని, అధికారులు ప్రొటోకాల్ సైతం పాటించలేదని సొంత పార్టీ ఎంపీటీసీలే ఆవేదన వ్యక్తం చేశారు. దుద్యాల తహసీల్దార్ దానయ్య, బొంరాస్‌పేట్ ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ సమాధానం చెబుతుండగా తుంకిమెట్ల బీఆర్ఎస్ ఎంపీటీసీ తిరుపతయ్య, మరికొందరు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డుల ఇస్తామని అధికారులు తెలిపారు. నాలుగేళ్లుగా అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయకుండా అధికారి లలితకుమారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకుంటున్న వారికి రూ.12వేలు ఇస్తామని ఏపీవో మల్లికార్జున్ తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఏఈ రాఘవేందర్ తెలిపారు. విద్యుత్ సమస్యలను తెలియజేస్తే పనులు పూర్తిచేస్తామని ఏఈ నాగరాజు చెప్పారు. ఇటీవల మృతిచెందిన బొంరాస్‌పేట్ ఎంపీవో పాండునాయక్, సీనియర్ అసిస్టెంట్ షరీఫ్, డీఆర్‌డీవో సిబ్బంది కుర్మయ్య, మండల పరిషత్ సిబ్బంది హేమలతలకు సభలో సంతాపం తెలిపారు. అనంతరం ఎంపీపీ, మాజీ వైస్‌ఎంపీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇదే చివరి సమావేశం కావచ్చొన్నారు. ఎంపీడీవో శ్రీదేవి, సూపరింటెంట్ వెంకన్నగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

అవి చిరుత పాదముద్రలు కావు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 14: మండల పరిధి అటవీ ప్రాంతంలో గుర్తించిన అటవీ జంతువు పాదముద్రలు చిరుతపులివి కాదని ఫారెస్టు అధికారులు ఖాజా, ఫరూక్‌అలీ మంగళవారం తెలిపారు. వారు బీట్ అధికారి ఎండీ వహీద్‌తో కలిసి అటవీ ప్రాంతంలో గాలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాందర్‌పూర్‌నకు చెందిన కొందరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోందనే సమాచారంతో అడవిలో గాలించామన్నారు. అయితే అటవీ జంతువు పాదముద్రలు గుర్తించినా అవి చిరుతవి కాదని తేల్చారు. హైనా తిరుగుతున్నట్టు అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.


అటవీ ప్రాంతంలో జంతువు పాదముద్రలను గుర్తిస్తున్న అధికారులు

కొత్త మున్సిపల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ

కొడంగల్/పరిగి/మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/శామీర్‌పేట, ఫిబ్రవరి 14: బదిలీల్లో భాగంగా మున్సిపాలిటీలకు కొత్తగా వచ్చిన కమిషనర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌గా బలరాంనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. కొత్త కమిషనర్‌ను సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పరిగి మునిసిపల్ కమిషనర్‌గా వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జి.శ్రీనివాసన్ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు బదిలీ అయ్యారు. కొల్లాపూర్ నుంచి వెంకటయ్య పరిగికి వచ్చారు. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా బి.నాగిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్‌లో పనిచేసిన త్రిలోకేశ్వర్‌రావు పీర్జాదిగూడకు బదిలీ అయ్యారు. కౌన్సిలర్లు నూతన కమిషనర్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు. శామీర్‌పేట మండలం తూంకుంట మునిసిపల్ కమిషనర్‌గా ఆర్.వెంకటగోపాల్ చార్జి తీసుకున్నారు. ఆయన మెదక్ జిల్లా నర్సాపూర్ మునిసిపాలిటీ నుంచి బదిలీపై తూంకుంటకు వచ్చారు. ఇప్పటి వరకు తూంకుంటలో పనిచేసిన జైత్‌రాం నర్సాపూర్ మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు.

వాహనాల పెండింగ్ చలానాలు చెల్లించాలి

ధారూరు/పెద్దేముల్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వం కల్పించిన రాయితీని వాహనాదారులు వినియోగించుకొని వాహనాల పెండింగ్ చలాన్‌లను చెల్లించాలని ధారూరు సీఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ వరకే పెండింగ్ చలానాలను రాయితీపై చెల్లించేందుకు గడువుందని చెప్పారు. మరోసారి గడువు పొడిగించే అవకాశం లేనందున నేడే చలానాలు కట్టుకోవాలన్నారు. పెద్దేముల్ ఎస్ఐ.గిరి కందనెల్లితండా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి మాట్లాడారు. చలానాలున్న వారు గురువారంలోగా కట్టేసుకోవాలని సూచించారు. తరువాత రాయితీ ఉండదన్నారు. నేడు చివరి రోజు అన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


పరిగిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయిత భాస్కర యోగి

పరిగి, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా బుధవారం పరిగిలోని పాఠశాల్లో అక్షరాభ్యాసం, సరస్వతి మాత విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుదీక్ష ఇండస్ వాల్యూ స్కూల్, సరస్వతీ శిశుమందిర్‌లో చిన్నారులకు అక్షరాభాస్యాలు నిర్వహించారు. హోమాలు నిర్వహించారు. రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆయన మాట్లాడుతూ.. సంస్కృతీ, సంప్రదాయాలను చిన్నారులకు వివరించాలని సూచించారు. వసంత పంచమిని శ్రీపంచమి అని కూడా అంటారన్నారు. కార్యక్రమాల్లో ఐవీఎస్ డైరెక్టర్ వీరేశం, శిశుమందిర్ అధ్యక్షుడు పార్థసారథి, ఎస్బీఐ మేనేజర్ అనుప్రభ, జిల్లా కార్యదర్శి వెంకట్‌రాంలు, కార్యదర్శి వెంకటేశం, హెచ్‌ఎం మల్లేశ్, గోపాల్ పాల్గొన్నారు.

కులకచర్ల: కుల్కచర్ల అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందం, పీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఆదర్శ కాన్వెంట్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. సరస్వతి దేవి విగ్రహానికి పూజలు చేశారు. పాఠశాల 2024 క్యాలండర్‌ను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, కరస్పాండెంట్ లక్ష్మి, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తాండూరు: చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప తదితరులు


కులకచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

తాండూరు : తాండూరు సాయిపూర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో వసంత పంచమి వేడుకను పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి వైస్ చైర్‌పర్సన్ దీప మాట్లాడుతూ.. సరస్వతీ దేవి అందరికి మంచి విద్య, బుద్ధి, జ్ఞానం ప్రసాదించాలని కోరుకున్నట్టు ఆమె తెలిపారు.


కొడంగల్ రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

మేడ్చల్ ఏసీపీగా శంకర్‌రెడ్డి

మేడ్చల్ ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ ఏసీపీగా సీహెచ్. శంకర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన సామల వెంకట్‌రెడ్డి బదిలీపై నగరంలోని సుల్తాన్ బ జార్ ఏసీపీగా వెళ్లారు. హైదరాబాద్ సీసీఎస్‌లో ఏసీపీగా పనిచేస్తున్న శంకర్‌రెడ్డి మేడ్చల్ ఏసీపీగా బదిలీపై వచ్చారు.

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విడుదల చేయాలి'

తాండూరు, ఫిబ్రవరి 14: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని, ఆయనను వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యమూర్తి మాట్లాడారు. నాయకులు అంజద్‌అలీ, కృష్ణయ్యగౌడ్ తదితరలుఁ ఉన్నారు.

'గృహజ్యోతి' దరఖాస్తుల స్వీకరణ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14: ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పథకం 'గృహజ్యోతి'కి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మర్రిపల్లిగూడ పంచాయతీ కార్యాలయంలో బుధవారం విద్యుత్ ఉద్యోగి పెంటయ్య దరఖాస్తులను స్వీకరించారు. 187 దరఖాస్తులు వచ్చినట్లు పెంటయ్య తెలిపారు.


మర్రిపల్లిగూడలో గ్రామస్తుల నుంచి గృహజ్యోతి దరఖాస్తులను స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగి

టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రవి శెట్టి

మర్పల్లి, ఫిబ్రవరి 14 : తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రవి శెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన టీపీఎస్ఎఫ్ సమావేశంలో సభ్యులు రవిని ఎన్నుకొని శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, కార్మికుల సంక్షేమం కోసం(టీపీఎస్ఎఫ్) ఎన్నో పోరాటాలు చేసిందని ఈ సందర్భంగా సభ్యులు అన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు రవి ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.


జిల్లా నూతన అధ్యక్షుడు రవి శెట్టిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఈద్గా స్థలం వక్ఫ్ బోర్డుదే..

తాండూరు, ఫిబ్రవరి 14 : తాండూరులోని సర్వే నంబర్ 110లో గల 7ఎకరాల 15గుంటల స్థలం, 51 దుకాణాల సముదాయం వక్ఫ్ బోర్డుకే చెందుతాయని, ముస్లిం వెల్ఫేర్ కమిటీకి తామే బాధ్యులం అని ఈద్గా, ఖబ్రస్థాన్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఖుర్షీద్ హుస్సేన్, అబ్దుల్ హదీ, గోల్కొండ సత్తార్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు రాష్ట్ర సీఈవో ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఇటీవల విచారణ జరిపి దీనిని వక్ఫ్‌బోర్డు స్థలంగా నిర్ధారించారని చెప్పారు. ముస్లిం వెల్ఫేర్ బోర్డు పర్యవేక్షణలోనే దుకాణాల సముదాయాన్ని నిర్మించామన్నారు. ఈద్గా అభివృద్ధికి ప్రజాప్రతినిధుల ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి పనులు చేశామన్నారు. బోర్డు బైలాస్ ప్రకారం తమ బాడీకే గుర్తింపు ఉందన్నారు. కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారు ఇప్పటికైనా ఈద్గా అభివృద్ధికి కలిసి రావాలని ఆయన కోరారు. అన్నింటికీ ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. సమావేశంలో ముస్లిం నాయకులు బషీర్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

రేపు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

దోమ, ఫిబ్రవరి 14: శుక్రవారం జరిగే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, రఘురాం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశంలో పేదరికం పెరిగిందన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్

శామీర్‌పేట, ఫిబ్రవరి 14: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బుధవారం శామీర్‌పేటలోని సెలబ్రెటీ రిసార్ట్స్‌లో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై ఆయన అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు, వాహనం వెనుక కూర్చున్నవారు హెల్మెట్లను తప్పక ధరించాలన్నారు. సాధారణంగా నడిపే వారే హెల్మెట్ ధరిస్తున్నారని, ఇది సరి కాదన్నారు. బైక్‌లపై వెళ్లేవారు ఇద్దరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని హెచ్చరించారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. మేడ్చల్ ట్రాఫిక్ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిగి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. పరిగిలోని బస్‌స్టేషన్‌లో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ.. పరిగిలో ఏటేటా ట్రాఫిక్ పెరుగుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపొద్దన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ ఎన్.శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం కరుణ శ్రీ, ఎస్ఐ సంతోష్, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.



పరిగి బస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

ధ్యానంతో ఆరోగ్యవంతమైన జీవనం

బొంరాస్‌పేట్/పరిగి, ఫిబ్రవరి 14 :శ్వాసపై ధ్యాస పెట్టి ధ్యానం చేస్తే మనిషికి వ్యాధులు దరిచేరవని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్ల ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త బాబు అన్నారు. జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడితో వచ్చే గుండెజబ్బు, బీపీ, షుగర్ వ్యాధులను ధ్యానంతో నయం చేసుకోవచ్చన్నారు. బుధవారం మెట్లకుంట, తుంకిమెట్ల గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ ప్రతినిధులు బాలకృష్ణారెడ్డి, నవీన్, శ్రీను, బాబు, చెన్నయ్య పాల్గొన్నారు. ధ్యానాన్ని నిత్య జీవితంలో భాగంగా మార్చుకొని, ఆరోగ్యాన్ని ప్రశాంతతను పొందాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటి ధ్యాన ప్రచార కార్యదర్శి బి.అంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త గుండం శైలజలు అన్నారు. పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో పరిగి మండలం రంగంపల్లి, గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధులు రాకుండా ఉండేందుకు ధ్యానంతో నియంత్రించుకోవచ్చని అన్నారు. నిత్య జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడిలతో సతమతమయ్యే వారికి ధ్యానం ఎంతో మేలు చేస్తుందన్నారు. రోజూ ఎవరి వయస్సు ఎంతో ఉంటుందో అన్ని నిమిషాల పాటు ధ్యానం చేయాలని సూచించారు. శాఖాహార జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మనిషికి ప్రమాదకర వ్యాధులు రాకుండా ధ్యానం నివారిస్తుందన్నారు. పిల్లలకు ధ్యానాన్ని అలవాటు చేస్తే వారికి చదువుపై ఏకగ్రాత కలుగుతుందని, అలాగే ఆరోగ్యకర జీవనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు నవీన్, వేణు, శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ధ్యాన ప్రచారకర్త బాబు

శ్రీగిరి వేంకటేశ్వరస్వామికి వార్షిక పూజలు


సంస్కృతి టౌన్‌షిప్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14:పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో గల శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన అయ్యప్ప ఆలయం

కులకచర్ల: కులకచర్లలోని అయ్యప్ప ఆలయం వద్ద శివస్వాములకు గనేశ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప కొండ శివనామస్మరణతో మార్మోగింది. శివమాల ధరించిన స్వాములతో పాటు గ్రామంలో ఉన్న శివస్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు చెన్నయ్య, కృష్ణయ్య, గోపాల్, అయ్యప్ప సేవా సమితి సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, ఈశ్వరయ్య, సతీశ్‌కుమార్, చంద్రశేఖర్, అంజిగౌడ్, శివకమార్ పాల్గొన్నారు.

తుల్జాభవానీ ఆలయ వార్షికోత్సవం

తాండూరు: తుల్జా భవానీ ఆలయ వార్షికోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నదానాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


తుల్జా భవానీ ఆలయంలో పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న


కులకచర్ల: అయ్యప్ప ఆలయం వద్ద బిక్ష చేస్తున్న శివస్వాములు

22న కొబ్బరి కాయల విక్రయానికి వేలం

కులకచర్ల, ఫిబ్రవరి 14 :మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయానికి, తల నీలాలు పోగు చేసుకునేందుకు ఈ నెల 22న బహిరంగ వేలాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ, ఈవో సుధాకర్ బుధవారం పేర్కొన్నారు. పాంబండ ఆలయం వద్ద జాతర మినహాయించి ఒక సంవత్సరం పాటు 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు కొబ్బరి కాయల దుకాణానికి, అలాగే ఒక సంవత్సరం పాటు 2024 మార్చి 1 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు తల నీలా లు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని వారు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా...

● **మూడుచింతలపల్లి:** మరమ్మతుల కారణంగా సంపన్‌బోల్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(గురువారం) విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌గౌడ్ బుధవారం తెలిపారు. 33/11కేవీ సంపన్‌బోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ అల్వమెడ్ ఫీడర్లలో నేటి ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల కరెంటు ఉండదన్నారు. జగ్గంగూడ, సంపన్‌బోల్ పారిశ్రామికవాడల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **బషీరాబాద్:** సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బషీరాబాద్ మండల సేవాలాల్ కమిటీ అధ్యక్షులు రామునాయక్, ప్రధాన కార్యదర్శి నరేష్ చౌహాన్ పిలుపునిచ్చారు. జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో నేడు సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ముఖ్యనేతలు పలువురు హాజరవతారన్నారు.డివిజన్, మండల పరిధిలోని బంజార నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

● **ధారూరు:** వికారాబాద్‌లో జి.ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేగా గెలిస్తే అంజనేయ స్వామికి 101 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్న కాంగ్రెస్ నాయకుడు బుధవారం తన మొక్కుతీర్చుకున్నాడు. ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో ప్రసాద్ కుమార్ గెలిస్తే 101 కొబ్బరి కాయలు కొడుతానని ధారూరు కాంగ్రెస్ నాయకుడు పి.సంఘమేశ్వర్ కులకచర్ల మండలం చౌడాపూర్ ఆంజనేయ స్వామికి మొక్కుకున్నాడు. ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిచి స్పీకర్ కావటంతో ఆయన మొక్కు చెల్లించాడు.

యువత ఉన్నతంగా ఆలోచించాలి : ఎస్సై

పూడూరు, ఫిబ్రవరి 14: యువత ఉన్నతంగా ఆలోచించాలని చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మేడిపల్లికలాన్‌లో బుధవారం రాత్రి జిల్లా కళాజాత బృందంతో ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. యువతకు సమస్య వస్తే పరిష్కారానికి ఆలోచించాలని సూచించారు. పరిష్కరించలేని సమస్యే లేదన్నారు. చిన్న సమస్యలకే కుంగిపోయి ఎవరూ ఆత్మహత్య చేసు కోవద్దని ఆయన అన్నారు. ఇతరులతో చర్చిస్తే సమస్యకు పరిష్కారమార్గం లభిస్తుందన్నారు. యువత ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని సూచించారు.


చెన్‌గోముల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వలస కూలీ ఆత్మహత్య

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 14 : కుటుంబ కలహాలతో ఓ వలస కూలీ ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుమేశ్(24) కొంత కాలంగా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో స్నేహితులతో కలిసి ఉంటూ ఐస్‌క్రీమ్ బండి నడిపిస్తున్నాడు. భార్య సొంత రాష్ట్రంలోనే ఉంటోంది. కొన్ని రోజులుగా దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. బుధవారం భార్యతో ఫోన్ మాట్లాడుతూ లక్ష్మాపూర్-తిమ్మాపూర్ రోడ్డు వైపు వచ్చిన సుమేశ్ ఆవేశంలో ఫోన్ పగలగొట్టి ఫారెస్ట్ వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆత్పత్రికి తరలించిన కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సుమేశ్ మృతదేహం

పోలీసులకు హిజ్రా వేషధారుల అప్పగింత

దోమ, ఫిబ్రవరి 14: హిజ్రాల వేషధారణతో వసూళ్లకు పాల్పడుతూ, చిన్నారులను ఎత్తుకెళ్తున్నారనే అనుమానంతో వారిని దొంగ ఎన్కెపల్లి వాసులు బుధవారం పోలీసులకు అప్పగించారు. కొందుర్గు మండలానికి చెందిన బి.సురేందర్, భీమయ్య, మరో వ్యక్తి హిజ్రా వేషంలో కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో బిక్షాటన చేస్తుండగా గ్రామస్తులు అనుమానించి దేహశుద్ధి చేశారు. తప్పించుకొని ఆటోలో పారిపోతుండగా ముజాహిద్‌పూర్ వాసులు దొంగఎన్కెపల్లి గ్రామస్తులకు సమాచారమిచ్చారు. అక్కడ వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులను 108 సిబ్బంది ఆస్పత్రిలో చేర్పించారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లికి చెందిన ప్రశాంత్(32), శ్రీకాంత్(27)లను ఘట్‌కేసర్ పట్టణ శివారెడ్డిగూడ వద్ద వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కీసర 108 సిబ్బంది రవి, రాంచందర్ అక్కడికి చేరుకొని క్షతగాత్రులకు నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

దోమ, ఫిబ్రవరి 14: మోత్కుర్‌లో గోద దస్తమ్మకు సర్వే నం:33లో ఎకరం 24 గుంటల పట్టాభూమి ఉంది. అందులో ఆమె సాగు చేసుకుంటున్నారు. ఇటీవల దస్తమ్మ పాలివారు గోద రాములమ్మ, సాయిలమ్మ వారి భాగం భూమిని వికారాబాద్‌కు చెందిన వ్యక్తులకు విక్రయించారు. బుధవారం సద్దాం అనే వ్యక్తి దస్తమ్మ స్థలంలోకి వచ్చి 'మేం రౌడీలం. 33సర్వే నంబర్‌లో మా భూమి కూడా ఉంది.' అని అంటూ కొందరిని తీసుకొచ్చి దస్తమ్మను, ఆమె కూతుళ్లను బెదిరించారు. గ్రామస్తులు డయల్ 100కు సమాచారం ఇవ్వగా పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై రవిగౌడ్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ.. అప్పగింత

కొడంగల్, ఫిబ్రవరి 14: కొడంగల్, దుద్యాల, చిట్లపల్లి, బుల్కాపూర్‌లకు చెందిన బాకారం శ్రీనివాస్, మోహన్, అంజాద్, విష్ణు, పూజ, మాధవ్ ఫోన్లు పోయాయని ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్‌చేసి బుధవారం అప్పగించామని ఎస్సై భరత్‌రెడ్డి తెలిపారు.